క్లుప్తంగా

భవననిర్మాణాలు వేగవంతం చేయాలి

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో నిర్మాణదశలో ఉన్న ప్రభుత్వ భవనాలను నిర్వాహకులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతూ అన్నిగ్రామాల్లో వివిధ పథకాల నిధులతో భవన నిర్మాణాలు జరుగుతున్నాయని, పనులు మంద కొడిగా జరుగుతున్నందున ఇంజినీరింగ్ సహాయకులు పరిశీలించి పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయించాలని సూచించారు. అలాగే సచివాలయం, రైతు భరోసా, వెల్‌నెస్ భవనాలు, మన బడి నాడు నేడు, జీజీఎంపీ నిధులతో మంజూరుచేసిన అభివృద్ధి పనుల విషయంలో ఇంజినీరింగ్ సహాయకులు నిర్వాహకులపై ఒత్తిడి తేవాలని చెప్పారు.

బగ్గందొరవలసలో పారిశుధ్య పనులు


కాలువల్లో పూడిక తీయిస్తున్న కార్యదర్శి శ్రీనివాసరావు

సీతానగరం: మండలంలోని బగ్గందొరవలసలో సర్పంచ్ ఎ.నారాయణ రావు ఆధ్వర్యంలో కార్యదర్శి శ్రీనివాసరావు బుధవారం కాలువల్లో పూడికలు తీయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని బీటీ రోడ్డును ఆనుకుని ఉన్న కాలువల్లో చెత్తనిరంతరం పడి పోవడంతో పారిశుధ్య కార్మికులతో తీయించి దూరప్రాంతానికి తరలించినట్లు చెప్పారు. అలాగే ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలను తొలగించడంతోపాటు మొక్కలు నాటడానికి మట్టి నమూనా చేయించినట్లు తెలిపారు.

ఫిజియోథెరపీపై అవగాహన


మాట్లాడుతున్న ఎంఈఓ సత్యనారాయణ

మక్కువ: మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులందరికీ బుధవారం స్థానిక ఎంఆర్‌సీ భవనంలో ఫిజియోథెరపీపై శిక్షణ ఇచ్చారు. నిజాం ఇన్‌స్టిట్యూట్ నుంచి వచ్చిన ఫిజియోథెరపిస్ట్ రమేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పెంట సత్యనారాయణ, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

నేడు సచివాలయ కన్వీనర్లతో సమావేశం

సాలూరు: జేసీఎస్, సచివాలయ కన్వీనర్లతో పట్టణంలోని శివాలయం రోడ్డు సీతారామ ధర్మశాలలో గురువారం సమావేశం నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం కార్యాలయవర్గాలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపాయి. ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర పాల్గొనే ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లకు వైఎస్సార్‌బీమా రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కన్వీనర్లు ఐడీ ప్రూఫ్‌లు, ఆధార్‌కార్డు తీసుకురావాలని సూచించారు.

అవగాహన తప్పనిసరి


అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సాలూరు: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని అగ్నిమాపక అధికారి సుధాకరరావు అన్నారు. అగ్నిప్రమాదాల నివారణపై పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయిల్ ట్యాంకర్ల ప్రమాదాలు జరిగినప్పుడు నష్టాన్ని ఎలా నివారించాలి, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది సీతారాం, సురేష్ కుమార్, ప్రజలు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి

గరుగుబిల్లి: విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని ఉమారామలింగేశ్వర విశ్వబ్రాహ్మణ సంఘం మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు బుక్కూరు బ్రహ్మజీ, చింతాడ తవిటాచార్యులు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం సంఘం సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలో విశ్వబ్రాహ్మణ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు, సమస్యల పరిష్కారానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు అంపిలి శ్రీను, అజ్జరాపు కాశీవిశ్వనాథం, బి.తిరుపతి రావు, బి. వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తా సైనికుడిలా పనిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్:

వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా పని చేయాలని, సచివాలయ కన్వీనర్లు పార్టీ బలోపేతమే ధ్యేయంగా కృషి చేయాలని ఎమ్మెల్యే జోగారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో నియోజకవర్గంలో జేసీఎస్ జీవిత బీమా నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీ బలోపేతానికి మరింత ప్రాధాన్యం ఇనిస్తూ ఇటీవల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా గల గ్రామ, వార్డు సచివాలయంల పరిధిలో పార్టీ తరపున కన్వీనర్లను నియమించడమే కాకుండా ప్రతి గ్రామ, వార్డులో గల వలంటీర్ల పరిధిలో గృహ సారథులను ఏర్పాటు చేసి, ప్రభుత్వ సేవలను, పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఏర్పాట్లు చేశారన్నారు. సచివాలయం కన్వీనర్లకు, గృహ సారథులు అందరికీ కూడా జీవిత బీమాను కల్పిస్తూ ఇటీవల నిర్ణయం తీసుకోవడమే కాకుండా జేసీఎస్ నమోదు శిబిరం కార్యక్రమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా గల సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులకు బీమా అందిస్తున్నారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై నాయకులు, కార్యకర్తలు అమితమైన గౌరవం కలిగి ఉన్నారన్నారు.

అధినేతకు అందరూ గుర్తే..

2019లో ఏ పదవులు, ఎలాంటి ప్రయోజనం పొందని సమయంలోనే జగన్‌మోహన్ రెడ్డి గెలుపు కోసం అహర్నిశలు కష్టపడి శ్రమించి పార్టీకి అత్యధిక మెజార్టీ స్థానాలను కల్పించి తిరుగులేని శక్తిగా నిలిపిన వైఎస్సార్‌సీపీ శ్రేణులందరినీ పార్టీ అధినేత గుర్తుంచుకున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో అంతకు మించి శక్తివంతమైన పోరాటం చేసి త్వరలో జరగబోయే కురుక్షేత్ర యుద్ధంలో ప్రతిపక్ష పార్టీలు, పచ్చ పత్రికలు, మీడియాలన్నీ ఏకమై దాడి చేసినా సరే వాటన్నింటిని ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, యిండుపూరి గున్నేశ్వర రావు, మూడు మండలాల జెడ్పీటీసీ సభ్యులు బలగ రేవతమ్మ, మామిడి బాబ్జి, అలజంగి రవికుమార్, ఎంపీపీలు మజ్జి శోభారాణి, బలగ రమణమ్మ, గుడివాడ నాగమణి వైస్ ఎంపీపీలు, మూడు మండలాలు, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, జేసీఎస్ కన్వీనర్లు నియోజకవర్గవె ఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మున్సిపల్ కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఏఎంసీ డైరెక్టర్లు, పీఏసీఎస్ చైర్మన్లు, సచివాలయం కన్వీనర్లు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన జేసీఎస్ కన్వీనర్లు

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం


లబ్ధిదారులకు బుక్‌లెట్ అందిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

- మంత్రి రాజన్నదొర

పాచిపెంట: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని కొటికిపెంట పంచాయతీ కొత్తవలసలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ఆయా కుటుంబాలకు ప్రభుత్వపరంగా కలిగిన లబ్ధిని వివరించారు. సమస్యలు ఏమైనా ఉంటే తెలియజేయాలని కోరగా.. పలువురు ఇళ్లు, రోడ్లు, కాలువల గురించి ప్రస్తావించారు.

దీంతో మంత్రి స్పందిస్తూ ఆయా అధికారులతో మాట్లాడి సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ప్రమీల, సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు మదల సత్యవతి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు డోల బాబ్జి, పాచిపెంట వీరంనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాలనాయుడు, వైస్ ఎంపీపీలు మీసాల నారాయణ, కోరిపల్లి రవీంద్ర, మాజీ వైస్ ఎంపీపీ తట్టికాయల గౌరీశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు మాదిరెడ్డి మధుసూదనరావు, చంద్రినాయుడు, అనరవిల్లి ఉమా, సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సాగు, తాగునీరు సౌకర్యాలు ప్రభుత్వ లక్ష్యం


మాట్లాడుతున్న ఏపీటిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

సీతానగరం: పార్వతీపురం నియోజక వర్గ ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం సాగునీరు, తాగునీరు సమకూర్చడానికి అధిక ప్రాధాన్యం ఇచ్చిందని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. ఈ మేరకు సీతాగనరం మండలంలోని లక్ష్మీపురంలో బుధవారం ఆయన కార్యకర్తల నుద్దేశించి మాట్లాడుతూ జంఝావతి ప్రాజెక్ట్ ఎత్తిపోతల పథకం ద్వారా ఆయకట్టు చెరువులకు సాగు నీరందించి లక్ష్మీపురం గ్రామస్తులకు తాగు నీరు సరఫరా చేయడానికి కృషి చేస్తానని చెప్పారు. ఎత్తిపోతల పథకం ద్వారా ఎడమకాలువ పనులు చేపట్టడానికి సంబంధిత ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారని చెప్పారు. లక్ష్మీపురంలోని కొన్ని వీధులకు తాగు నీరందడం లేదని మహిళలు చప్పడంతో పూర్తి స్థాయిలో తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. నవరత్నాలు అమలులో భాగంగా అర్హులైన వారందరూ పక్కా గృహాలు కట్టించుకుని సొంతింటికల నెరవేర్చు కోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు వెంకటరమణ, సీహెచ్ అప్పలనాయుడు, సింహాచలం, పి రాము, టి అప్పారావు, సీహెచ్ లక్ష్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీకాల వివరాలు నమోదు చేయాలి

- డీఐఓ టి.జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: ఐదేళ్లలోపు పిల్లలకు వేసే టీకాల వివరాలు యూవిన్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు నమోదు చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన పట్టణంలోని 18,19 వార్డులకు చెందిన అంగన్వాడీ కేంద్రంలో టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. సెషన్‌లో టీకా అర్హుల జాబితాను, ఏ టీకాలు వేస్తున్నారో పరిశీలించారు. అదేవిధంగా తదుపరి గడువు తేదీలను టీకా కార్డులో స్పష్టంగా వేయాలని సిబ్బందికి సూచించారు. పిల్లలు, గర్భిణులకు వేసిన ప్రతి టీకా వివరాన్ని కొత్తగా చేర్చిన యూవిన్ పోర్టల్‌లో వెంటనే నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన చర్చివీధిలో పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఓపీ రికార్డ్, ల్యాబ్ పరిశీలించి ఏఏ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు, వాటి ఫలితాలు,


టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

అందుకు కారణమైన అనారోగ్య లక్షణాలు తదితర అంశాలపై సిబ్బందిని ఆరా తీశారు. జ్వరాలు గుర్తిస్తే సంబంధిత ప్రాంతంలో నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్యాధికారి డాక్టర్ మనోజ్ఞ, సూపర్‌వైజర్ పుష్ప, వైద్యసిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్పంచ్ ఉప ఎన్నికకు సర్వం సిద్ధం

- గుమ్మ సర్పంచ్ బరిలో నలుగురు అభ్యర్థులు
- 19న ఎన్నిక

కురుపాం: మండలంలోని గుమ్మ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి ఉప ఎన్నికకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ నెల 19న ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరగనుంది. గుమ్మ పంచాయతీ పరిధిలోని పురుష ఓటర్లు – 571 మంది, మహిళా ఓటర్లు 631 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఓటు వేసేందుకు రెండు గదులను అధికారులు ఏర్పాటు చేసారు. సర్పంచ్ బరిలో నలుగురు అభ్యర్థులు ఉండగా అదే రోజు ఓట్ల లెక్కింపు చేసి ఫలితం ప్రకటించనున్నారు.

పోటా పోటీగా ప్రచారం

బరిలో ఉన్న అభ్యర్థులు నలుగురు పోటా పోటీగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. పంచాయతీ పరిధిలో 8 గ్రామాలు ఉండగా ఆయా గిరిజన గ్రామాలకు వెళ్లి తమ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటికే గుర్తులు కూడా అభ్యర్థులకు కేటాయించటంతో కరపత్రాలతో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక రేపు

కురుపాం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ పార్వతీపురం ఈఈ వీవీ కిశోర్ బుధవారం తెలిపారు. ఫోరం చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అధ్యక్షతన జరగనున్న ఈ పరిష్కార వేదికలో పార్వతీపురం ఐటీడీఏ సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు పాల్గొని తమ సమస్యలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు. సూచనలు, సలహాలు కూడా అందించవచ్చని తెలిపారు.

పేదలకు వస్త్రదానం

భామిని: మండలంలోని పెద్దదిమిలిలో రిటైర్డ్ హెచ్‌ఎం ఎద్దు గోపాలదాస్‌నాయుడు ఆధ్వర్యంలో పేదలు, వృద్ధులకు వస్త్రదానం బుధవారం చేశారు. సర్పంచ్ తొగరాన శ్రీను, వెల్ఫేర్ అసిస్టెంట్ రాజేష్ పట్నాయక్ సహకారంతో పేదలకు అందజేశారు.

మౌలిక సదుపాయాలతో జీవన ప్రమాణాల మెరుగు


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: మౌలిక సదుపాయాల కల్పనతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పురపాలక సంఘం పరిధిలో గల 12వ వార్డు, గంటావీధి ప్రజల కోరిక మేరకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధుల ద్వారా నిర్మించనున్న సీసీ కాలువలు, రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వార్డులో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అప్పట్లో వార్డు ప్రజలు వీధిలో కాలువ, రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానిక కౌన్సిలర్ ద్వారా తన దృష్టికి తీసుకు వచ్చిన సందర్భంగా తక్షణమే చర్యలు తీసుకుని ప్రభుత్వం దృష్టిలో పెట్టి గడపగడపకు కార్యక్రమం నిధులు వెచ్చించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తున్నామని చెప్పారు. మీరంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి వచ్చే 2024 సాధారణ ఎన్నికల్లో మళ్లీ సీఎంగా గెలిపించి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక కౌన్సిలర్ తాడ్డి అరుణ శంకరరావు దంపతులు, కో ఆప్షన్ సభ్యులు షేక్ షఫి, ఏఎంసీ డైరెక్టర్ షేక్ సకీనా జాని, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్‌కాలేజీలో స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ డీజీఎస్‌వీ త్రినాథ్

సీతానగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులను ప్రోత్సహిస్తూ దాతలు స్టడీ మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమని ప్రిన్సిపాల్ డీజీఎస్‌వీ త్రినాథ్ అన్నారు. పార్వతీపురం ఎకనామిక్స్ అధ్యాపకుడు తెర్లి రవికుమార్ బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ ఫస్టియర్, సెకెండియర్ విద్యార్థులకు ఎకనామిక్స్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ త్రినాథ్ మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో పాల్గొనే విద్యార్థులకు సులభతరంగా చదవడానికి, రాయడానికి స్టడీ మెటీరియల్ ఉపయోగ పడుతుందని విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. అధ్యాపకుడు రవికుమార్ మాట్లాడుతూ అధ్యాపకులమంతా తయారుచేసిన స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు తెలియజేశారు. ఇటీవల పార్వతీపురం జూనియర్ కాలేజీలో పంపిణీ చేశామని, తాజాగా సీతానగరం ప్రభుత్వ జూనియర్‌కాలేజీలో పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో ప్రదీప్‌కుమార్, డి.రామకృష్ణ, ఎ.రామకృష్ణ, నవీన్, రమేష్ అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుకు సన్నద్ధం కావాలి

- ఆసక్తిగల రైతుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం
- సబ్సిడీపై డ్రిప్, ఉచితంగా మొక్కల పంపిణీ

సీతానగరం: మంచి లాభాలువచ్చే ప్రత్యామ్నాయ, వాణిజ్య పంటల వైపు రైతులను మళ్లించేదిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే ఆయిల్ పామ్ సాగుకు రాయితీలు కల్పించి ప్రోత్సహిస్తోంది. ఈ ఏడాది పార్వతీపురం మన్యం జిల్లాలో 30 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగును చేపట్టేందుకు సర్కార్ అనుమతులివ్వగా జిల్లా ఉద్యాన శాఖ ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఆసక్తిగల రైతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. తోటలను సాగు చేసే రైతులకు మొక్కలను ఉచితంగా అందజేయనున్నారు. డ్రిప్ సిస్టమ్‌ను బీసీలకు 90 శాతం, ఎస్సీ,ఎస్టీలకు వందశాతం సబ్సిడీపై అందిస్తారు. పంట సాగునుంచి కొనుగోలు వరకు శ్రీనివాసా పామాయిల్ మిల్లు (రాజాం) తోపాటు ఇతర మిల్లులుకు బాధ్యతలు అప్పగించారు.

రాయితీ ప్రోత్సాహకాలు

ఆయిల్ పామ్ సాగును పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఎకరాకు 50 నుంచి 57 మొక్కలు అవసరం ఉండగా వాటిని రాయితీపై అందజేస్తోంది. డ్రిప్ సిస్టమ్ కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం సబ్సిడీ ఇస్తుంది. పన్నెండున్నర ఎకరాల వరకు రైతులు రాయితీలు పొందే అవకాశం ఉంది. పంట ఎదుగుదల కాలంలోనూ ఎకరాకు రూ.4 వేల నగదును ప్రభుత్వం ప్రోత్సాహకంగా అందిస్తుంది.

ఎకరాకు రూ.2లక్షల ఆదాయం

నీరు నిలవని లోతైన ఒండ్రు నేలలు, అధిక సేంద్రియ పదార్థం కలిగి, నీరు తేలికగా ఇంకిపోయే గుణం కలిగి ఉండి, నీరు సమృద్ధిగా ఉన్న సారవంతమైన నేలల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తే మూడున్నరేళ్ల నుంచి 30 ఏళ్ల వరకు నిరంతర ఆదాయం పొందవచ్చు. నాలుగేళ్ల తర్వాత దిగుబడులు ఎక్కువగా మొదలవుతాయి. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా ఆయిల్ పామ్ కాయలకు టన్ను రూ.13 వేలకు పైగానే ధర ఉంది. ఈ లెక్కన ఎకరాకు రూ.1.3 లక్షల ఆదాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు. డ్రిప్ ద్వారా మొక్కలు ఎండిపోకుండా నీరు సమృద్ధిగా అందిస్తే దిగుబడులు మరింతగా వస్తాయంటున్నారు.


బగ్గందొరవలసలో ఏర్పాటు చేసిన శ్రీనివాసా పామాయిల్ నర్సరీ


రాయితీపై రైతులకు పంపిణీ చేస్తున్న మొక్కలు

విదేశాల నుంచి 70 శాతం దిగుమతి

విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న ఆహార పదార్థాల్లో ఆయిల్‌వాటానే ఎక్కువగా ఉంది. మన దేశంలో ప్రస్తుతం సాగవుతున్న ఆయిల్‌పామ్‌తో కేవలం 30 శాతం డిమాండ్ మాత్రమే తీరుతోంది. మిగతా 70 శాతం నిల్వలను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. దీంతో ప్రభుత్వం ఈ పంట సాగును పెంచేదిశగా చర్యలు తీసుకుంటోంది.

అందుబాటులో నర్సరీ, పంట సేకరణ కేంద్రం....



పామాయిల్ పంట సాగు చేస్తున్న రైతులకు అందుబాటులో పామాయిల్ గెలల సేకరణకు, తోటల పెంపకానికి అవసరమైన మొక్కలు పంపిణీకి బగ్గందొరవలసలో నర్సరీ నిర్వహిస్తున్నాం. ఆసక్తి కల్గిన రైతులకు రాయితీపై మొక్కలు పంపిణీ చేస్తున్నాం.

– పి.మణిదీప్ కృష్ణ, సీఈఓ, శ్రీనివాసా పామాయిల్ మిల్లు(రాజాం)

రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలి



జిల్లా రైతులు ఆయిల్ పామ్ వైపు దృష్టి సారించాలి. ఈ పంట సాగుచేసే రైతులకు ప్రభుత్వం భారీగా ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఈ పంట మనప్రాంతంలో దశాబ్ద కాలంగా సాగుచేస్తున్నాం. ఇక్కడి వాతావరణం, భూములు అనుకూలంగా ఉన్నాయి. మొక్కలు నాటడం, సస్యరక్షణ చర్యలు, పంటల విక్రయాల వరకు ఉద్యానశాఖ అండగా ఉంటుంది. ఆసక్తిగల రైతులు ఉద్యాన అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి.

– కె సత్యనారాయణరెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి



